శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## తెలంగాణా వరదబాధితులకు మాజీ ఎంపి మేకపాటి 25లక్షల విరాళం



**ఆత్మకూరు, సెప్టెంబర్16ప్రభాతవార్త:** ఇటీవల వరదలతో తెలంగాణా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. వారి సహాయార్థం నెల్లూరు మాజీ ఎంపి, వైసిపి నాయకుడు మేకపాటి రాజమోహన్‌రెడ్డి 25లక్షల రూపాయల విరాళం ప్రకటించిన విషయం విదితమే. సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణా సిఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి 25లక్షల రూపాయల చెక్కును అందజేశారు. తీవ్ర వర్షాలు, వరదలతో ఇబ్బందులు పడిన ప్రజలందరిని ఆదుకునేలా ప్రభుత్వం కృషి చేయాలని , ప్రజాప్రతినిధులు , ప్రజలు, స్వచ్ఛందసంస్థలు తమ వంతు పూర్తిసహకారం అందించాలని కోరారు. ఈసందర్భంగా తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాజీ ఎంపి మేకపాటిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. అందరి సహకారంతో వరదబాధితులను పూర్తిస్థాయిలో ఆదుకుంటున్నామని, బాధితులను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో మేకపాటి రాజమోహన్‌రెడ్డి కుమారుడు పృద్వీరెడ్డి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఇంటూరికి ధన్యవాదాలు తెలిపిన బంగారు వ్యాపారస్తులు



**కందుకూరు, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త** ఇటీవల కందుకూరు పెద్ద బజార్‌లో ఉన్న గాయత్రి జ్యూయలరీలో జరిగిన దొంగతనంలో దొంగలను 24 గంటల్లోపు అరెస్టు చేయటంలో ప్రత్యేక శ్రద్ధ చూపిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి కందుకూరు ది బులియన్ మర్చంట్ అసోసియేషన్ తరుపున బంగారు వ్యాపారస్తులు ఎమ్మెల్యే నాగేశ్వరరావుని కలిసి ఘనంగా సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం వ్యాపారులకు అండగా నిలిచిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి బంగారు వ్యాపారస్తులు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా అది తన సొంత కష్టంలా భావించి అండగా ఉంటానని ఎమ్మెల్యే అన్నారు. వ్యాపారస్తులందరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని విలువైన వస్తువుల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ది బులియన్ మర్చంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఇమ్మడిశెట్టి సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శి తుమ్మలపూడి సురేష్, కోశాధికారి కాకుమాని బ్రహ్మయ్య, ఆర్యవైశ్య నాయకులు మురారిశెట్టి సుధీర్, కోట కిషోర్, వేముల సుకుమార్ గుప్తా, అనుమాల శెట్టి శ్రీకాంత్, కాకుమాని ప్రవీణ్‌కుమార్, చక్కా వెంకట కేశవరావు, చేగు శేషారావు, ఇడవలపాటి సునీల్, ఇస్కాల ప్రతాప్, ఆరికట్ల ప్రసాద్, కోట సురేష్, వేముల పార్థు, గుర్రం మధు, కోట సుబ్బారావు పాల్గొన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ పార్వతి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో సోమవారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ సురేష్, కమిటీ సభ్యులు, భక్తులు ఉన్నారు.

## మహ్మాద్ ప్రవక్త పుట్టిన రోజు ముస్లింల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే దగుమాటి

(ఫోటో...కెవిఎల్ 11,12)



**కావలి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త** మహ్మాద్ ప్రవక్త పుట్టిన రోజు సందర్భంగా కావలి పట్టణంలోని జెండా చెట్టు సెంటర్ నుంచి ముస్లిం సోదరులు నిర్వహించిన ర్యాలీలో సోమవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ ర్యాలీలో ఉదయగిరి బ్రిడ్జి సెంటర్, ఎన్టీఆర్ సర్కిల్, కావలి ఐకాన్ సెంటర్ వరకు ముస్లిం సోదరులతో ఎమ్మెల్యే పాదయాత్రగా వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దాతృత్వం, క్రమశిక్షణ, శాంతి, సోదర బావాలతో మనుగడ సాధించడం దైవత్వంతో సమానమన్నారు. దివ్య ఖురాన్ బోధనలతో మానవాళిని ప్రభావితం చేసే సమాజాన్ని హింసా, ద్వేషాల నుండి విముక్తి చేసి శాంతి వైపు నడిపిన మహోన్నతమైన వ్యక్తి మహ్మాద్ ప్రవక్త అని కొనియాడారు. ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులందరికి మిలాద్ ఉన్ నబి శుభాకాంక్షలు తెలిపారు. మహ్మాద్ ప్రవక్త చూపిన శాంతి, ఐక్యత, మానవతా మార్గాలు నుంచి స్ఫూర్తి పొందుదామన్నారు. పేదలకు, నిస్సహాయులకు అండగా నిలుద్దామని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకున్నారు.

## మంత్రి నారాయణతో భేటీ అయిన కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి



**నెల్లూరు రూరల్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త** రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణతో టిడిపి నేత కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సోమావారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి ఎనిమిది డివిజన్‌లో ఉన్నాయని ఆయా ప్రాంతాల్లో త్రాగునీరు రహదారులు బీసీ భవనాలు క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్‌లో తదితర అంశాలపై ఆయన మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వాటిని కావాల్సిన నిధులు విడుదల చేయాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వాటికి కావాల్సిన నిధులు విడుదల చేయాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి పొంగూరు నారాయణ తొందర్లోనే ఈ సమస్యలకు పరిష్కారం చేస్తామని సానుకూలంగా స్పందించారు. త్వరలోనే రూరల్ గ్రామాలకు అన్ని విధాల ప్రభుత్వం అండగా నిలుస్తుందని కోటంరెడ్డి గిరిధర్ రెడ్డికి మంత్రి హామీ ఇచ్చారు.

## మిలాద్-ఉన్-నబి శుభాకాంక్షలు తెలియజేసిన దేవళ్ళ



**గుడ్లూరు, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త** ఇస్లాం మత స్థాపకుడు మహమ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకుని జరుపుకునే పండుగ మిలాద్ – ఉన్– నబీ ఇస్లాం మత సాంప్రదాయ అనుసారం అల్లాహ్ దీవెనలు, ప్రేమ, దయ, కరుణా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆశిస్తూ మిలాద్ ఉన్ నబీ పురస్కరించుకుని పేదల పట్ల, ఆపన్నులకు తమ శక్తి కొద్దీ ప్రేమ సహాయ సహకారాలు అందించాలని ఆశిస్తూ కందుకూరు నియోజకవర్గ జనసేన పార్టీ తరపున ప్రేమ పూర్వక మిలాద్– ఉన్– నబి శుభాకాంక్షలను కందుకూరు నియోజకవర్గ జనసేన నాయకులు దేవళ్ళ భాస్కరరావు తెలియజేశారు.

## గాయపడ్డ వారికి ఎమ్మెల్యే సోమిరెడ్డి పరామర్శ



**మనుబోలు, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త** మండల కేంద్రమైన మనుబోలు కోదండరామపురం బీసీ కాలనీలో వినాయక చవితి నిమజ్జనంలో టపాసులు పేలి గాయపడ్డ వారిని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. స్థానిక బీసీ కాలనీలో ఆదివారం రాత్రి వినాయకుడి నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్లే సమయంలో టపాసులు కాల్చే ప్రయత్నంలో ఒక ఆకాజువ్వా కరెంటు వైర్లకు తగిలి దాని నిప్పురవ్వలు గోడపక్కన టపాసుపై పడి బాణసంచా పేలింది. ఈ ఘటనలో సుమారు 22 మంది గాయపడ్డారు. బాలాయిపల్లి మండలం పిగలం గ్రామానికి చెందిన ఉమామహేష్ అనే బాలుడు దర్మరణం చెందాడు. అలాగే ఈ ప్రమాదంలో బీసీ కాలనీకి చెందిన 21 మంది గాయపడ్డారు. వీరిలో చాలా మంది చెవ్వులు వినపడక, కొందరికి చేతులు, కాళ్ళకు దెబ్బలు తగిలాయి. వీరందరిని పరామర్శించేందుకు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి బీసీ కాలనీలో ఇంటి దగ్గర ఉన్న క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఉత్సవాలు, ఊరేగింపులలో టపాసులు కాల్చే విధానానికి స్వస్తి చెప్పాలన్నారు. తాను ఎన్నికల ప్రచారం చేస్తున్న సమయంలో ఒక ఆకాజువ్వ తన నెత్తిన పడి గాయమైంది గుర్తు చేశారు. సంతోషం ఉండొచ్చుగాని హద్దులు దాటకూడదని హితవు చెప్పారు. బాణసంచా పేలిన ఘటనలో ఉమామహేషన అనే బాలుడు చనిపోవడం దురదృష్టకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. వాళ్ళ తల్లిదండ్రులకు ఆ పిల్లవాడు లేని లోటును మనం తీర్చలేమని, ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. కలెక్టర్‌తో మాట్లాడి క్షతగాత్రుడికి ఏమైనా సాయం చేసేందుకు ప్రయత్నిస్తానని, నెల్లూరు ఆసుపత్రిలో ఉండేవారిని పరామర్శిస్తానని సోమిరెడ్డి చెప్పారు. ముందుగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కాలనీకి రాగానే బాణసంచా పేలి ధ్వంసమైన మోటారు సైకిల్, ఇళ్లు, గాయపడ్డ వారిని పరామర్శించి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. సీఐ రాంబాబు ఎమ్మెల్యే సోమిరెడ్డికి బాణసంచా పేలుడు ఎలా జరిగిందనేది వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు గాలి రామకృష్ణారెడ్డి, తిరుపతిపార్లమెంటు కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పొన్నూరు రామకృష్ణయ్య, తిక్కవరపు శ్రీదర్‌రెడ్డి, ఎల్‌ఎన్‌పురం సర్పంచ్ కే.సునీల్, మాజీ సొసైటీ అధ్యక్షులు ముంగర విజయభాస్కర్‌రెడ్డి, ఏ.సురేష్, పొన్నూరు అశోక్, కలికి రమేష్‌రెడ్డి, కలికి సుధీర్‌రెడ్డి, పుట్టా మస్తాన్, వీఆర్వోలు నాగార్జునరెడ్డి, మురళి, తెలుగుదేశం పార్టీ మాజీ మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు చేరెడ్డి పట్టాభిరామిరెడ్డి, సానె వెంకటరమణయ్య, చల్లగిరి ప్రసాద్, మానుగుంట సుధాకర్‌రెడ్డి, జనసేన పార్టీ సర్వేపల్లి ఇన్‌ఛార్జి బి.సురేష్ నాయుడు, జనసేన అధ్యక్షులు పెనుబాక ప్రసాద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## కోన పవిత్రోత్సవాలలో శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహునికి తిరుచ్చి ఉత్సవం



**పెంచలకోన(రాపూరు), సెప్టంబరు16ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో స్వామివారి పవిత్రోత్సవాలలో రెండవ రోజైన సోమవారం స్వామి,అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి ప్రాకారోత్సవం నిర్వహించారు. ఉదయం వేద,దివ్యప్రబంధ పారాయణాలు,ద్వార తోరణ, ధ్వజకుంభారాధన, మహా కుంభారాధన, చక్రజ్జమండల, అగ్నిప్రతిష్ట,విశేష హోమాలు, వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకుపాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, కొబ్బరనీళ్ళు, పసుపు, చందనంలతో స్నపన తిరుమంజనం (అభిషేకం), నిర్వహించారు. తదుపరి ప్రాయశ్చిత్త హోమం, శ్రీవార్లకు పవిత్రములు సమర్పించారు. సాయంత్రం చతుస్థానార్చన, వేద దివ్యప్రబంధపారాయణాలు, విశేష హోమలు నిర్వహించారు. స్వామి,వారిని ఉభయ దేవేరులతో కలసి తిరుచ్చిపై వుంచి ప్రాకారోత్సవంనిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప కమీషనర్ కె. విజయ సాగర్ బాబు, ఆలయ ప్రధానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి,ఆలయ సీనియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీనారాయణ,అర్చక స్వాములు శశి స్వామి, మధు స్వామి, నాగరాజు స్వామి, వర్ధన్ స్వామి,వినోధ్ స్వామి, వేదపండితులు, ఉభయ కర్తలు, ఆలయ సిబ్బంది,పెద్ద ఎత్తున భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్‌తీగలు చోరీ : పట్టించుకోని అధికారులు

**వలేటివారిపాలెం సెప్టెంబరు 16, ప్రభాతవార్త** మండలంలోని రోళ్లపాడు గ్రామానికి జాతీయ రహదారి 167బి నుంచి కొత్త విద్యుత్‌లైన్ ఏర్పాటు చేశారు. జగనన్న కాలనీ లేఅవుట్‌కి విద్యుత్ సరఫరా చేయడం నిమిత్తం ఈ లైన్ మంజూరు చేశారు. ఒంగోలుకి చెందిన కాంట్రాక్టర్ గత ఎన్నికలకు ముందే పని మొదలు పెట్టారు. దాదాపు 65స్తంబాలు వేశారు. విద్యుత్ తీగలను సైతం అమర్చారు. ఆ తరువాత ఎన్నికలు జరగడం,ప్రభుత్వం మారడం జరిగింది. దీనితో పనులు ముందుకు పోలేదు. అయితే ఈ నేపద్యంలో స్తంబాలుకు వేసిన విద్యుత్‌తీగలు చోరీకి గురవుతున్నాయి. గతంలో కొన్ని స్తంబాలకేసిన విద్యుత్ తీగలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. మరలా శనివారం రాత్రికి విద్యుత్‌తీగలను చోరీచేశారు. ఇది గ్రామంలో సంచలనమైంది. గతంలో రాళ్లపాడుకి పోలినేనిపాలెం మీదుగా విద్యుత్‌లైన్ వేశారు. ప్రస్తుతం ఆలైన్ మరమ్మత్తులకు గురవడంతో ఈ కొత్తలైన్ ద్వారా గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు అధికారులుకు విజ్ఞప్తి చేస్తున్నారు. దీంతో కొత్తలైన్ ఏర్పాటుపై గ్రామస్తులు ఆశలుపెట్టుకున్నారు. కరెంటు డిపార్టుమెంటు పై అనుభవం గల వ్యక్తులే ఈ ఘాతుకానికి పాల్పడుతున్నట్లు గ్రామస్తులు అనుమానిస్తున్నారు. మైన్ లైన్ నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేసి అతిజాగ్రర్తగా పనులు చక్కబెట్టుకున్నట్లు బావిస్తున్నారు. విలువైన ఈ విద్యుత్ తీగలకు మార్కెట్‌లో మంచి డిమాండు ఉందని రైతు మార్తాల వెంకటేశ్వర్లు అన్నారు. సిల్వర్‌పాత్రల తయారీకి ఉపయోగిస్తారని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నేపద్యంలో తరచూ చోరీలు జరుగుతున్నా విద్యుత్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**లైన్‌మన్‌కి చెప్పాం-శివరామిరెడ్డి** గతంలో విద్యుత్‌తీగల చోరీ జరిగిన విషయం లైన్‌మన్‌కి పిర్యాదుచేశా. అయినా మరలా శనివారం రాత్రికి చోరీ జరగడం బాధాకరమని రోళ్లపాడు టీడీపీ నేత పిల్లి శివరామిరెడ్డి అన్నారు.

**పోలీసులకు పిర్యాదుచేస్తునా ౦...** ఏఈ ఈ విషయమై విద్యుత్ ఏఈ టి.మధుబాబు మాట్లాడుతూ ఈ చోరీ కరెంటు దొంగల పనే అన్నారు. పూర్తివివరాలుతో పోలీసులకు పిర్యాదు చేస్తున్నామన్నారు. మెయిన్ లైన్‌లో విద్యుత్ సరఫరా నిలిపేసి ఈ ఘాతుకానికి పాల్పడ్డారంటే కరెంటువిబాగంపై పూర్తి అవగాహన కలిగిన వ్యక్తుల పనే అన్నారు.



## కావలి మున్సిపాల్టీ పరిధిలో 120 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించాం

### 70 ఎకరాలలో కాలువలు, గుంతల భూమిని వెలికితీశాం !!

### కావలి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్





**కావలి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త** కావలి పట్టణ మున్సిపాల్టీ పరిధిలో 2019 సంవత్సరం నుండి 2024 మధ్య కాలంలో నాలుగు నుడా అనుమతి పొందిన లేఅవుట్లు, అనేక అనధికార లేఅవుట్లు వేసి వున్నారని, పలు ఫిర్యాదులను పురస్కరించుకుని సర్వే చేయగా 120 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇప్పటి వరకు గుర్తించామని కావలి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. సోమవారం కావలి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, తహశీల్దార్ శ్రావణ్, టిపివో బాబురావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. ఇప్పటి వరకు గుర్తించిన 120 ఎకరాల ప్రభుత్వ భూమిలో 70 ఎకరాల మేరకు కాలువలు, గుంతలుగా గుర్తించి భూమిని వెలికితీయడం జరిగిందన్నారు. మిగిలిన 50 ఎకరాలు ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యాయన్నారు. రెవెన్యూ, సర్వే శాఖ, మున్సిపాల్టీ వారిచే ప్రత్యేక బృందాల ద్వారా సర్వే చేసేందుకు కావలి ఆర్డీవో శీనానాయక్ చేపట్టారన్నారు. ఇంకా ప్రభుత్వ భూమిని ఈ సర్వే బృందాలు సర్వే చేస్తున్నాయన్నారు. ఈ సర్వే ఇంకా కొనసాగుతుందన్నారు. కొంతమంది ఆర్‌టిఐ చట్టం ద్వారా సమాచారం కోరడం జరిగిందన్నారు. మున్సిపల్ కార్యాలయంలో వున్న కొంతమంది అధికారులు సమాచారం ఇవ్వడంలో అసంపూర్తిగా వుందన్నారు. దీంతో ప్రజలు వాస్తవాలు తెలియజేసేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమాచారాన్ని సక్రమంగా ఇవ్వని ఇద్దరు అధికారులపై క్రమశిక్షణా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ 120 ఎకరాలు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించినా, కాలువలు, గుంతలు కబ్జా చేసినా, అక్రమ లేఅవుట్లు వేసినా చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తీవ్ర స్థాయిలో హెచ్చరికలు చేశారు. సర్వే బృందాలు కాలువలు, గుంతలు తీసిన ఫోటోలు మీడియాకు చూపించారు.

## 15 లక్షలు ఖర్చు పెట్టారు.. పాఠశాలను మూసివేశారు

### - కోవూరు మండలంలో నాడు-నేడు సంగతి ఇదీ




**కోవూరు, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** గత ప్రభుత్వం నాడు-నేడు పథకం ద్వారా ఉన్నత పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాలలను కూడా అభివృద్ధి పనులు చేపట్టాలనే ఉద్దేశం మంచిదే అయినా ఆ పాఠశాలలోని విద్యార్థుల సంఖ్యాతో సంబంధం లేకుండా తమ ఇష్టానుసారంగా ఎడాపెడా నిధులు ఖర్చు చేశారు. బడులను మెరుగుపరిస్తే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని ఆలోచించారా అంటే అదీ లేదు. తీరా లక్షలు ఖర్చు పెట్టి పనులు పూర్తి చేశాక ఆ బడినే మూసివేయడం గమనార్హం. పాఠశాలలో విద్యార్థి సంఖ్యతో సంబంధం లేకుండా గత వైసీపీ ప్రభుత్వం నిధులు దుబారా చేయడానికి ఇది ఒక నిదర్శనం. ఈ దుస్థితి ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో కాదు.. కోవూరు నియోజకవర్గానికి మండల కేంద్రమైన కోవూరు మండలం చెర్లోపాలెం పంచాయతీ పరిధిలోని కట్టకింద ప్రాంతంలో చోటు చేసుకుంది. కోవూరు మండలంలో నాడు-నేడు తొలి ఫేజ్ కింద 12 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో చెర్లోపాలెం పంచాయతీ కట్టకింద చెర్లోపాలెం ప్రాథమిక పాఠశాలలో ఈ పథకం కింద 15 లక్షలను మంజూరు చేశారు. 13 లక్షలతో పనులు పూర్తయ్యాయని, ఇంకా 2 లక్షలు ఉన్నాయని మండల విద్యాశాఖ చెబుతుండగా సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాత్రం రూ. 2 వేలు మాత్రమే ఉన్నాయని చెప్పడం గమనార్హం. ఈ లక్షల రూపాయలు వ్యయం చేసి పాఠశాలలో మరుగుదొడ్లు, విద్యుచ్ఛక్తి, కిటికీలు, స్టీల్ రైలింగ్, ఏర్పాటు చేశారు. అయితే ఈ పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్య అప్పట్లోనే 13గా ఉంది. పాఠశాలకు చదువు చెప్పే ఉపాధ్యాయుడు సక్రమంగా పాఠశాలకు రాకుండా సెలవు పెట్టడంతో విద్యార్థుల తల్లిదండ్రులు 10 మందిని ఆ ప్రాంతం నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న రెడ్డిపాలెం ప్రభుత్వ పాఠశాలకు ఆటో పంపేలా వారే ఏర్పాటు చేసుకున్నారు. ఈ విధంగా ఉపాధ్యాయుడి నిర్లక్ష్యం కారణంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 13 నుంచి 10 పడిపోయినా సంబంధిత విద్యాశాఖలో ఇసుమంతైనా స్పందన లేకపోవడం గమనార్హం. వాస్తవంగా ఈ నాడు-నేడు పనులు మంజూరైన పాఠశాలల అభివృద్ధి పనులు ఆశించిన మేర జిల్లా అధికారులు గానీ, మండల అధికారులు కానీ స్పందించిన దాఖలాలు లేవు. దీంతో పాఠశాల అభివృద్ధికి లక్షలాది రూపాయలు వ్యయం చేసి ఖర్చు పెట్టినా తీరా ఆ పాఠశాలను ఆగస్టు నెలలో మండల విద్యాశాల మూసివేసింది. ఒకవైపు పాఠశాలతో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా నాడు-నేడు పేరిట గత ప్రభుత్వం తమ ఇష్టానుసారంగా నిధులు ఖర్చు చేసింది. ప్రస్తుతం ఈ పాఠశాలను మూసివేయడంతో ఉన్న ముగ్గురు పిల్లఉ కూడా రెడ్డిపాలెం ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థుల తల్లిదండ్రులే పంపడం విశేషం. ఇప్పటికైనా ఈ పాఠశాలలో జరిగిన అభివృద్ధి పనులపై జిల్లా అధికారులు ఆకస్మికంగా పరిశీలిస్తే అనేక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. పాఠశాల మూసివేసిన విషయమై మండల విద్యాశాఖను ప్రభాతవార్త వివరణ కోరగా.. విద్యార్థులు లేని కారణంగా పాఠశాల మూసివేయడం వాస్తవమేనని, దీనికి సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులతో కూడా ఎన్నో సార్లు మాట్లాడినా వారిలో ఆశించిన విధంగా మార్పు రాలేదన్నారు.



## రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి పంచలోహాల కిరీటాలు బహుకరణ



**బిట్రగుంట, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీలోని రామస్వామి పాళెంలో శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి రిటైర్డ్ రైల్వే డ్రైవర్ బి.ఎన్. బాన్‌సింగ్ అమ్మవారికి, విఘ్నేశ్వరుడికి, సుబ్రమణ్య స్వామికి పంచలోహాలతో తయారు చేసిన కిరీటాలు బహుకరించారని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు బత్తల రవిచంద్ర తెలిపారు. దాతకు ఆలయం తరపున ప్రత్యేక పూజలు నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు.

## మాలేపాటి నివాసానికి పెద్దఎత్తున తరలివచ్చిన టిడిపి నాయకులు, కార్యకర్తలు



**దగదర్తి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాలేపాటి సుబ్బానాయుడు ఆరోగ్యం కుదట పడి స్వగ్రామమైన దగదర్తిలోని ఆయన నివాసానికి సోమవారం వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి మండల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున మాలేపాటి నివాసానికి తరలివచ్చి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాలేపాటి నాయకులు, కార్యకర్తలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మాలేపాటి సుబ్బానాయుడు మాట్లాడుతూ దగదర్తి మండలంలో టిడిపి కార్యకర్తలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ విజయానికి కార్యకర్తలు ఎంతగానో కృషి చేశారని తెలిపారు. వారికి అన్యాయం జరిగితే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. దగదర్తి మండల ప్రజలకు, కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా వుంటానని తెలిపారు. ఏ అవసరం వచ్చినా తనను కలవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాలేపాటి రవీంద్రనాయుడు, కంచర్ల కృష్ణ, గోపాల్, పాపానాయుడు, తదితర టిడిపి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ



**వరికుంటపాడు,సెప్టెంబర్ 16,ప్రభాతవార్త :** స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమములో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపిడిఓ కార్యాలయం వద్ద నుండి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ మల్లికార్జున తెలిపారు.అక్టోబర్ రెండున గాంధీజి 150 వ జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛతా హీ సేవ ఉద్యమానికి శ్రీకారం చుట్టారనీ అందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం,జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరిని ఈ కార్యక్రమములో భాగస్వామ్యులను చేయడం కోసం మండలంలో ర్యాలీ నిర్వహణతో పాటు ప్రతి గ్రామ పంచాయతీలో స్వచ్ఛ కార్యక్రమాలను చేపడామని ఎంపిడిఓ మల్లికార్జున తెలిపారు.కాబట్టి మండలంలోని ప్రజా ప్రతినిధులు,ప్రజలు భాగస్వామ్యులై స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## నర్రా కాంతమ్మ మరణం బాధాకరం

**నెల్లూరు, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త- వైద్యం :** కొండాపురం తెలుగుదేశం పార్టీ మండల మాజీ ప్రజాపరిషత్ అధ్యక్షురాలు, స్వర్గీయ పోలినేని మాలకొండయ్య సోదరి నర్రా కాంతమ్మ మరణం అత్యంత బాధాకరమని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొండాపురం మండల తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో నర్రా కాంతమ్మ క్రియాశీలకంగా వ్యవహరించేవారు. పార్టీ బలోపేతానికి ఎంతో శ్రమించారని అన్నారు. కొండాపురం ఎంపీపీగా ఉన్న సమయంలో మండలంలో అనేక అభివృద్ధి పనులకు నర్రా కాంతమ్మ శ్రీకారం చుట్టారు. మండల అభివృద్ధి కోసం అనునిత్యం తపించారన్నారు. ఎంపీపీగా ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీపడని వ్యక్తిత్వం ఆమెది. నాడు కొండాపురం జడ్పీటీసీగా పని చేస్తున్న నాకు ఆమెతో ప్రత్యేక అనుబంధం ఉందని చెప్పారు. నర్రా కాంతమ్మ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తునానన్నాడు.

## ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



**కోవూరు, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** కోవూరులోని ప్రధాన జామియా మసీదులో సోమవారం మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని కోవూరు ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అనంతరం భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు రఫీ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ఈ వేడుకను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఇమామ్ ఎస్కే షమీమ్, అసోసియేషన్ కార్యదర్శి ఎస్కే జుబేర్, ఉపాధ్యక్షుడు రఫీ అహ్మద్, తదితరులు ఉన్నారు.

## ఘనంగా లడ్డు వేలం



**కోవూరు, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని పెద్ద పడుగుపాడులో ఉన్న రామాలయం సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహానికి గత 9 రోజులుగా నిర్వాహక కమిటీ నిత్యం పూజలు నిర్వహిస్తూనే ఉన్నారు. ఈ మేరకు సోమవారం వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి గణేష్ లడ్డును పెద్ద పడుగుపాడు ప్రాంతానికి చెందిన గొల్లప్రోలు రాజేష్ యాదవ్ 20,500 రూపాయలకు పాట పాడి దక్కించుకున్నారు. ఈ సందర్భంగా రాజేష్ యాదవ్ మాట్లాడుతూ వినాయకునితో పాటు నిత్యం పూజలు అందుకున్న లడ్డును వేలంపాటలో పొందడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు కూడా ఉన్నారు.

## జాతియ రహదారిపై గేదలను ఢీకోన్న లారీ 5 గేదేలు మృతి





**సిద్దవరం(రాపూరు),సెప్టంబరు16ప్రభాతవార్త :** మండలంలోని సిద్దవరం గ్రామం వద్ద జాతియ రహదారి 565పై వేగంగా వస్తున్న లారీ రోడ్డు దాటుతున్న గేదలను ఢీ కోన్న ఘటనలో 5 గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో గేదే తీవ్రంగా గాయపడ్డది. దీంతో గేదేల యజమానులు తమకు జీవనాధారమైన గేదేల మృతి చెందడంతో తమకు ఇక జీవనాధారం ఎలా అంటూ రోధించారు. తమకు నష్ట పరిహారం అందజేసి తమను ఆదుకోవాలంటూ వారు కోరుతున్నారు. ఈ ప్రమాదంలో లారీలోని డ్రైవర్,క్లీనర్‌లకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. లారీ మాత్రం గేదేలను ఢీ కోన్న రోడ్డు పక్కకు దిగి పోవడంతో లారీ కోంత మేర దెబ్బతినింది.

## మా బిడ్డ ఆచూకి తెలపండి...తల్లిదండ్రులు గగ్గోలు






**కావలి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** కావలి పట్టణంలోని అరుంధతీయపాళెంకు చెందిన 14 సంవత్సరాల గౌడుపేరు మహేష్ ఈ నెల 11వ తేది నుంచి కనపడటం లేదని మా బిడ్డ ఆచూకి తెలపాలంటూ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా వేడుకుంటున్నారు. సోమవారం కావలి రైల్వే రోడ్డులో జర్నలిస్ట్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కావలి అరుంధతీయపాళెంకు చెందిన తల్లిదండ్రులు గౌడుపేరు చిన్నయ్య, శిరీష విలపిస్తూ మాట్లాడారు. తమ కుమారుడు కావలి పట్టణంలోని కాకతీయ హైస్కూలులో 9వ తరగతి చదువుతున్నాడని తెలిపారు. ఈ నెల 11వ తేది రాత్రి 7 గంటల నుంచి కనపడటం లేదన్నారు. కావలి మొత్తం గాలించామన్నారు. మా బిడ్డ జాడే తెలియలేదన్నారు. కావలి ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశామన్నారు. ఇప్పటికి ఆరు రోజులైనా తమ బిడ్డ ఆచూకి తెలియలేదన్నారు. ఎలా మిస్ అయ్యాడో అంతుపట్టక తల్లడిల్లుతున్నామన్నారు. ఎదిగి వచ్చిన 14 సంవత్సరాల వయసు కలిగిన బిడ్డ కనపడటం లేదని పోలీసులు త్వరితగతిన విచారించి తమకు అప్పజెప్పాలని వారు వేడుకుంటున్నారు. తమ బిడ్డ ఫోటో చూసిన వారు ఎవరికైనా తారస పడితే కావలి పట్టణంలోని అరుంధతీయపాళెం 82206 61333, 6305385671 నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని తల్లిదండ్రులు ప్రాధేయపడుతున్నారు. ఈ సమావేశంలో కుటుంబ సభ్యులు లావణ్య, లక్షమ్మలు పాల్గొన్నారు.

## నేడు కిసాన్ క్రాఫ్‌ను సందర్శించనున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



**పొదలకూరు, సెప్టెంబర్ 16. ప్రభాతవార్త :** పొదలకూరు మండలం ప్రభగిరిపట్నం సమీపంలోనున్న కిసాన్ క్రాఫ్ట్‌కు రేపు మంగళవారం సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి రానున్నారు. ఉదయం 10.30 గంటలకు కిసాన్ క్రాఫ్ట్ రానునట్లు కిసాన్ క్రాఫ్ట్ మేనేజ్మెంట్ వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి పత్రిక విలేకరులు, మీడియా ప్రతినిధులు హాజరుకావాలని వారు కోరారు. కిసాన్ క్రాఫ్ట్‌లోని రైతుల పనిముట్లను అదే విధంగా తయారీ విధానాన్ని మిషనరీని ఎమ్మెల్యే సోమిరెడ్డి పరిశీలించనున్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కిసాన్ క్రాఫ్ట్ యాజమాన్యం పిలుపునిచ్చారు.

## గరిమనపెంట వెంకయ్యస్వామి అశ్రమంలో చోరి

### రూ.2 లక్షల నగదు ఎత్తుకెళ్లిన దుండగుడు



**గరిమనపెంట(రాపూరు),సెప్టంబరు16ప్రభాతవార్త :** రాపూరు మండలంలోని తెగచర్ల పంచాయితీ పరిధిలోని గరిమనపెంట గ్రామంలో వున్న వెంకయ్య స్వామి ఆశ్రమంలో దోంగలు పడ్డారు. అలస్యంగా అందిన సమాచారం మేరకు అశ్రమ వ్యవస్థాపకుడు నరసింహ స్వామి చెప్పిన మాటల ప్రకారం రెండు రోజుల క్రింతం ఆర్ధరాత్రి అశ్రమంలోకి ఒక దోంగ ప్రవేశించి అశ్రమంలో ఆలయం నిర్మించేందుకు బీరువాలో వుంచినరూ. 2లక్షల నగదును బీరువా పగులకోట్టి తీసుకెల్లాడన్నారు. దీంతో పాటు అశ్రమంలోని వెంకయ్య స్వామి హుండీ నీ కూడా పగులకోట్టి అందులోని నగదు తీసుకెల్లాడు. ఈ దోంగతనానికి సంబందించి ఒక్కరు వచ్చినట్లు అశ్రమంలోని సి.సి కెమరాలో వున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన రాపూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఏఎస్ఐ వెంకటేశ్వర రావు సంఘటనా స్థలానికి చేరుకోని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వేలిముద్ర నిపుణులు వచ్చి ఘటనా స్థలంలో వెలిముద్రలు తీసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

## వసతి కల్పించిడిసార్!యంఎల్ఏకి 108 ఉద్యోగుల అబ్యర్ధన.



**కలిగిరి, శప్టెంబర్16, ప్రభాతవార్త;** ప్రభుత్వం ఏర్పాటుచేసిన 108 వాహనానికిగానీ, 108 శిబ్బందికి గానీ సరైన వసతి లేక ఇబ్బందిపడుతున్నామని కలిగిరి మండల 108శిబ్బంది యంఎల్ఏ దృష్టికి తమ సమస్యను అర్జీ రూపంలో అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కడసమస్య వచ్చినా ఉరుకుల పరుగులతో వెళ్తుంటామన్నారు. రాత్రనక పగలనకు ఒక్క పోన్‌కాల్ రాగానే పరుగులు తీస్తామనేన్నారు. అలాంటి తాముఉండేందుకు అధికారులు ఎక్కెడా స్తలం చూపక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. డ్యూటీ అయిన తరువాత విశ్రాంతి తీసుకునేవసతికూడా లేదన్నారు. డ్యూటీస మయంలో నిద్రకూడా ఉండడంలేదన్నారు.కనుక అన్నీ తెలిసిన మీరు 108వాహనం నిలుపుకునేందుకు, తమకు విశ్రాంతితీసుకునేందుకు వపతిని కల్పించాలని కాకర్ల దృస్టికి తీసుకువచ్చారు. దీనితో స్పందిచిన యంఎల్ఏ తప్పక మీసమస్యను వీలైనంత దొందరలో పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో నరేష్ తదిరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ భక్తిమార్గాన్ని అలవర్చుకోవాలి



**ముత్తుకూరు, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరు తమ జీవితంలో భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలని కొత్తపల్లి రమేష్ శర్మ అన్నారు. సోమవారం గవలపాలంలోని వినాయకుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడఉతూ వినాయక చవితి దేశ వ్యాప్తంగా అంగరంగ వైభవంగా నిర్వహించడం చాలా అభినందనీయమన్నారు. భక్తి మార్గంలో నడవడం వల్ల ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవచ్చన్నారు. నిష్ట నియమాలతో గణపతిని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమం నిర్వహించి నిమర్జనం విభజన చేయడం జరుగుతుందన్నారు. అనంతరం కొత్తపల్లి రమేష్ కుమార్ శర్మని ప్రజలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముత్తుకూరు మండలం మాజీ ప్రధాన కార్యదర్శి ఆలూరు వెంకట విష్ణువర్ధన్ రావు, బ్రహ్మదేవి హై స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ మహేష్, కలికి మధుసూధన్ రెడ్డి, బొబ్బేపల్లి అంకయ్య, వెంకటరమణయ్య, దయాకర్, దాసరి శ్రీనివాసులు, సుబ్బరామిరెడ్డి, బద్రి షేక్ మౌలాలి, మారుబోయిన ప్రసాద్, ఉప్పల ప్రసాద్, ఉప్పల హరి గౌడ్, యువత నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## వేగవంతంగా కరెంట్ బిల్లులు వసూలు చేయాలి



**విడవలూరు, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త :** మండలంలో విద్యుత్ బిల్లులు రైతులు వద్ద, ఇంటి బిల్లులు వేగవంతంగా చెల్లించే విధంగా చూడాలని ఈఈ కె. రమేష్ చౌదరి మండల కేంద్రం ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సోమవారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, రైతులు సోలార్ విధానాన్ని వాడుకోవడం దానివల్ల ఉపయోగం ప్రజలకు అవగాహన కలిగే విధంగా తెలియజేయలన్నారు. ఈ కార్యక్రమంలో గండవరం, డిఈఈ వెంకటేశ్వర్లు, ఏఈలు సురేష్ కుమార్, శ్రీనివాసులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుని గ్రామోత్సవం



**అల్లూరు, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా అల్లూరు శంభని వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహానికి 9 రోజుల పాటు విశేష పూజలు అందించి చివరి రోజున స్వామి వారికి విశేష పూల అలంకరణ, విద్యుత్ దీపాలంకరణ, బాణాసంచా, మంగళవాయిద్యాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి నిమజ్జనం నిర్వహించారు. సాయంత్రం స్వామి లడ్డూకు వేలం పాటు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## కావలి రైల్వే స్టేషన్ ఉదయగిరి బ్రిడ్జి దగ్గర మందా మాలకొండయ్య మృతి

**కావలి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** కావలి రైల్వే స్టేషన్ పరిధిలో ఉదయగిరి బ్రిడ్జి దగ్గర సోమవారం ఉదయం కొండాపురం మండలం ఎర్రబల్లికి చెందిన మందా మాలకొండయ్య మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అల్బెండజోల్ మాత్రలు ఇచ్చే కార్యక్రమం విజయవంతం చేయండి



**గుడ్లూరు, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త :** మంగళవారం నాడు జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోనూ, అంగన్‌వాడీ కేంద్రాలల్లో 1 నుండి 19సంవత్సరాల లోపు పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు ఇచ్చే కార్యక్రమం విజయవంతం చేయాలని, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.మారుతీరావు అన్నారు. సోమవారం ఇందుకు సంబంధించి స్థానిక పీహెచ్‌సీలో సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడుతూ మండలంలోని మొత్తం 60 ప్రభుత్వ స్కూల్స్ నందు 3031 మంది పిల్లలకు, మొత్తం 11 ప్రైవేటు పాఠశాలలోని 1619 పిల్లలకు, 60 అంగన్‌వాడీ కేంద్రంలలోని 1747 పిల్లలకు రేపు మధ్యాహ్నం భోజనం అనంతరం మ్రింగించుటకు అల్బెండజోల్ మాత్రలు అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు, అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించడం, ఇది వరకే జరిగినట్లు వైద్యాధికారి తెలియజేశారు. ఈ కార్యక్రమం వలన పిల్లల ప్రేగుల్లో చేరి ఉన్న నులి పురుగులు, ఏలికపాములు, కొంకి పురుగులు మరణించడం జరుగుతుందని, తద్వారా ఆ పిల్లలకు రక్తహీనతను తగ్గించడం, చదువుపై శ్రద్ధ చూపడం, మంచి ఆరోగ్యం లభిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమం గురించి పిల్లలు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ నాయకులు, కార్యకర్తలు రేపు జరగబోవు ఈ కార్యక్రమానికి వైద్య సిబ్బందికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ భాస్కరరావు, సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

## విషపురుగుల మధ్య గిరిజన బిడ్డల బ్రతుకులు



**విడవలూరు, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త :** మండలం దంపూరు పంచాయితీ రామచంద్రపురం గిరిజన కాలనీలో సుమారు 100 కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. గత టిడిపి ప్రభుత్వంలో ఎంజిఎన్ఆర్‌జిఎస్ పథకం ద్వారా ఒకటిన్నర లక్ష, ఎమ్మెల్యే గ్రాండ్ కింద మూడున్నర లక్ష అంగన్వాడి భవన నిర్మాణం కోసం మంజూరు చేయడం జరిగింది. అంగన్వాడీ భవన నిర్మాణం చేసేందుకు గుంతలు ఏర్పరిచి బేస్ చుట్టూ వైపులా కాంక్రీట్‌తో బెల్ట్ పోయడం జరిగింది. భవనం కోసం కావాల్సిన కాంక్రీట్, ఇసుక, కమ్మి చేర్చడం జరిగింది. కాంట్రాక్టర్లకు మధ్య పొంతన లేక వాటాలు సరిపోక భవన నిర్మాణం పూర్తిగా నిలిపివేశారు. అప్పటి నుండి కాలనీలో అంగన్‌వాడీ భవనం లేకపోవడం అద్దె భవనం విషపురుగుల మధ్య బిడ్డలు ఉండవల్సిన పరిస్థితి ఏర్పడిందని గిరిజన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, గిరిజన కుటుంబాలపై దయ చూపించి నిలిచిపోయిన అంగన్‌వాడి భవనాన్ని పున ప్రారంభించాలని ప్రాధేయపడుతున్నారు.

## కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల్ని ప్రభుత్వ స్టాఫ్ నర్సులుగా నియమించాలి



**కావలి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** కావలి ప్రభుత్వ వైద్యశాలలో గత 15 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులుగా పనిచేస్తున్నామని ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించాలని కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు కోరారు. సోమవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యేని కలిసి వినతి పత్రం అందజేశారు. మీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## వేదమంత్రాల నడుమ వైభవంగా జరిగిన గణేష్ నిమజ్జనం



**కావలి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కావలి కలుగోళ శాంభవి ఆలయ ప్రాంగణంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ మలిశెట్టి విజయలక్ష్మి దంపతుల, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవాల గణేష్ నిమజ్జనం అత్యంత వైభవంగా సోమవారం రాత్రి జరిగింది. ఈ నిమజ్జన కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. 20 అడుగుల భారీ గణనాధుని నిమజ్జన కార్యక్రమం బాణాసంచా శబ్దాల హోరులో సాగింది. విద్యుత్ దీప కాంతులతో, బాణాసంచా శబ్దాల మధ్య డిజె సౌండ్ సిస్టమ్‌తో దప్పు, మంగళవాయిద్యాల నడుమ గణేష్ నిమజ్జనం సాగింది. వందలాది మంది భక్తుల సమక్షంలో గణనాధుడి నిమజ్జన కార్యక్రమం హోరెత్తింది. కావలి కలుగోళ శాంభవి ఆలయం నుంచి మందాటి చెరువు వరకు ఈ నిమజ్జన ఊరేగింపు సాగింది. కనీవినీ ఎరుగని రీతిలో గణనాధుని భారీ ఊరేగింపు కావలిని ఎంతగానో ఆకట్టుకుంది. కావలి ట్రబుల్ షూటర్ మలిశెట్టి...కితాబు ఇచ్చిన ఎమ్మెల్యే.కావలి టిడిపి సీనియర్ నేత, రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎయంసి ఛైర్మన్ తన సోదరుడు మలిశెట్టి వెంకటేశ్వర్లు ఏ కార్యక్రమం చేయాలన్నా విజయవంతం చేసే శక్తి భగవంతుడు ఆయనకు ఇచ్చాడని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. కావలి ట్రబుల్ షూటర్ అంటూ మలిశెట్టిని ఆయన కొనియాడారు.కావలిని కనువిందు చేసేలా, అందరు ఆనందడోలికల్లో ఉర్రూతలుగేలా 9 రోజుల పాటు గణేష్ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించిన దిట్ట మలిశెట్టి అన్నారు. ఈసారి ఆయన నాయకత్వంలో జరిగే ఈ ఉత్సవాలలో తాను పాటుపంచుకుంటానని హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. గణేష్ నిమజ్జనం జరిగే వరకు అందరు మందాటి చెరువు వరకు వెళ్లి గణనాధుడ్ని సాగనంపాలని ఆయన పిలుపునిచ్చారు. మలిశెట్టి దంపతుల్ని, నిర్వాహకుల్ని ప్రత్యేకంగా అభినందించారు.

## సరైన పత్రాలు లేని పది ద్విచక్ర వాహనాలు పట్టుకున్న పోలీసులు



**బిట్రగుంట, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** బోగోలు మండలం కప్పరాళ్ళతిప్ప కూడలిలో కావలి రూరల్ సిఐ బి.ప్రసాద్‌రావు, బోగోలు ఎస్ఐ బోజ్యానాయక్‌లు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో సరైన పత్రాలు లేని పది వాహనాలను పట్టుకున్నారు.ఆ వాహనాలకు జరిమానాలు విధించారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**నెల్లూరు క్రైం, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో స్థానిక మెడికవర్ ఆసుపత్రి సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న రవికుమార్ (60) మృతి చెందారు. మెడికవర్ ఆసుపత్రి వెనకవైపు ఉన్న అపార్ట్మెంట్‌లో నివసిస్తున్న రవికుమార్ నెల్లూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో పని చేస్తున్నారు. ఆదివారం రాత్రి ఇంటికెళ్లే సమయంలో జాతీయ రహదారిని దాటుతుండగా చెన్నై వైపు నుండి వచ్చే వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాల పాలయ్యారు. వెంటనే ఆయనను కుటుంబ సభ్యులు చెన్నైలోనే ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ అక్కడ సోమవారం ఆయన మృతి చెందినట్లు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నెల్లూరు సౌత్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

## మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పరామర్శ



**మనుబోలు, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త :** స్థానిక కోదండరామపురం బీసీ కాలనీలో సోమవారం సాయంత్రం మాజీ మంత్రి, వైకాపా జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి బాణసంచా బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా వైకాపా నాయకులు వినాయక నిమజ్జనంలో బాణసంచా జరిగిన విషయాన్ని కాకాణి గోవర్ధన్‌రెడ్డికి వివరించారు. అనంతరం క్షతగాత్రుల ఇళ్లకు వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ పరామర్శ ముగిసిన తరువాత మీడియాతో మాట్లాడారు. ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని వాపోయారు. ప్రభుత్వం క్షతగాత్రులకు చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలని సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, వైస్ సర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ నెట్‌క్యాప్ డైరెక్టర్ దాసరి భాస్కర్‌గౌడ్, బీసీ కాలనీ వైకాపా నాయకులు మన్నూరు పెంచలయ్య, చలగల దయాకర్, కట్టువపల్లి వైకాపా నాయకులు గుండాల ఆదినారాయణ, ప్రదీప్, అక్కంపేట వైకాపా నాయకుడు పి.శ్రీహరిరెడ్డి, సర్పంచ్ చెవుడుగుంట ఏడుకొండలు, ముంగర రవీంద్రరెడ్డి, వి.రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో 3వ స్థానం సాధించిన కొత్తసత్రం విద్యార్థిని



**కావలి రూరల్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త** కావలి రూరల్ మండలం కొత్తసత్రం ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎల్లంగారి జ్యోతి మహారాష్ట్ర నాందేడులో జరిగిన జాతీయ స్థాయి జంపురోప్ త్రిమినిట్స్ ఇండోరెన్స్ జాతీయ స్థాయిలో మూడవ సాధించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ మురళి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఎల్లంగారి జ్యోతిని అభినందించారు. అనంతరం ఎల్లంగారి జ్యోతి మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇంతదూరం వెళ్లగలిగానని, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మురళి సహాయంతో ఇంత స్థాయికి చేరుకోవడం జరిగిందని తెలిపారు.

## ఘనంగా ఎస్‌డబ్ల్యుఎఫ్ 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**కావలి రూరల్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త**



కావలి ఆర్టీసీ డిపోలో సోమవారం స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫె డరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) 46వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిఐటియు గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య ఎస్‌డబ్ల్యుఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యుఎఫ్ డిపో నూతన కమిటీ ఆధ్వర్యంలో యూనియన్ సభ్యత్వం పెంచుకోవాలన్నారు. యూనియన్ సభ్యుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం రీజనల్ సెంటర్ నెల్లూరులో జరిగిన ఆవిర్భావ వేడుకల్లో పది మంది కావలి డిపో సభ్యులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ సీనియర్ నాయకులు వెంకయ్య, సెక్రటరీ సి.హెచ్.వెంకటేశ్వర్లు, కాలేషా, రోశయ్య, ఎం.ఎ.బేగ్, వలి, ఎస్.కె.యం.బాషా, యుసియం రాజు, కె.ప్రసాద్, పులి శ్రీను, మనోహర్ పాల్గొన్నారు.

## ఉత్తమ గురువులకు ఇదే మా వందనం





**వింజమూరు, సెప్టెంబర్16 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రవేట్ మేనేజ్మెంట్, అన్‌ఎయిడెడ్ అసోసియేషన్ ఉదయగిరి నియోజకవర్గ పాఠశాలల ఆధ్వర్యంలో అపస్మా నియోజకవర్గ అధ్యక్షుడు కె.వి.రత్నం అధ్యక్షతన సోమవారం వింజమూరులో ఉత్తమ ఉపాధ్యాయులకు, ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమా నికి ముఖ్య అతిథులుగా తూర్పు రాయలసీమఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి , ఉదయ గిరి నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్, అపస్మా జిల్లా అధ్యక్షుడు ఎల్. శ్రీధర్ , స్టేట్ వైస్‌ప్రెసిడెంట్ రమణారెడ్డి, కలిగిరి సిఐ వెంకటనారాయణ, కలిగిరి ఎస్ఐ ఉమాశంకర్, వింజమూరు ఎంఇఒ శ్రీధర్ , కలిగిరి ఎంఇఒలు రమేష్, సురేష్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా వివిధ పాఠశాలల కరస్పాండెంట్‌లు, నియోజకవర్గంలోని 19పాఠశాలల ఉపాధ్యాయులను సన్మానించారు. 12 పాఠశాలల్లో 10వ తరగతి పరిక్షల్లో ప్రతిభకనపరచిన విద్యార్థులను సన్మానించారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో టీచర్స్ డే వేడుకలు నిర్వహించడం హర్షణీయమన్నారు.ప్రవేటు పాఠశాలల్లో కూడా విద్యను బోధిస్తున్న ఉపాధ్యాయులకు వారి ప్రతిభను ఆధారంగా సత్కరించి వారికి బహుమతులను అందజేయడం అపస్మా నేతల ఉదారతకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రవేటు పాఠశాలలు ఏకతాటిపై నడిపిస్తూ ఈపాఠశాలలకు ఏ సమస్య వచ్చినా అపస్మా అండగా నిలబడడం అభినందనీయమన్నారు. రాష్ట్రస్థాయిలో అపస్మాకు ప్రత్యేక గుర్తింపు కలిగి ఉందన్నారు. టీచర్స్‌డే వేడుకలనే కాక , ప్రజా సేవాకార్యక్రమాల్లో ముందుంటుందని వారు కొనియాడారు.ఈకార్యక్రమంలో అపస్మా కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి , ట్రెజరర్ కృష్ణారావ్, నియోజకవర్గ కార్యదర్శి ఉదయ్‌శంకర్‌రెడ్డి, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే



**కందుకూరు, సెప్టెంబర్ 16 ,ప్రభాతవార్త** వినాయక చవితి నవరాత్రులు సందర్భంగా పట్టణంలోని ముది రాజ్ పాలెంలో స్థానిక మత్స్యకారులు ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద కందుకూరు శాసన సభ్యు లు ఇంటూరి నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంత్యంత భక్తిశ్రద్దలతో శాస్త్రోక్తంగా మంత్ర శ్లోకం చదువుతూ గణనాధునికి పూజలు చేశారు. తారతమ్యం బేధాలు ఇసుమంత కూడా లేని యువ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బడుగుల బంధువులా మత్స్యకారులతో కలిసి కూర్చుని పూజలు చేపట్టారు. పదవిలో ఉన్నాననే దర్పం చూపక పేదల ఇంట్లో మనిషిలా నేలపై కూర్చున్న ఎమ్మెల్యేను చూసి స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరిని ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించడంతో నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు. ముందుగా మత్స్యకారుల సంఘం అధ్యక్షులు కొంగల నాగరాజు ఎమ్మెల్యేకి శాలవాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి పూజా కార్యక్రమం వద్దకు స్వాగతం పలికారు. పూజా అనంతరం విగ్రహ కమిటీ యువకులు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుని ఘనంగా సన్మానించారు. ముదిరాజ్‌పాలెంలోని గణపతి పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, స్థానిక మత్స్యకారులు పాల్గొన్నారు.

## చంద్రన్న బీమా 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచడం హర్షణీయం



**కోవూరు, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం చంద్రన్న భీమాను 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచడం హర్షణీయం అని జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. కోవూరులోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2015లో అప్పటి ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ప్రవేశపెట్టిన చంద్రన్న బీమా పథకాన్ని వైసీపీ ప్రభుత్వం పేరు మార్చి నిర్వీర్యం చేసింద న్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో కుటుంబ సభ్యులందరికీ భీమా వర్తింజేస్తే వైసీపీ ప్రభుత్వంలో కుటుంబంలో ఒక్కరికి మాత్రమే బీమా వర్తింపజేయడమే కాకుండా సహజ మరణానికి కూడా పరిహారం తగ్గించిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ పథకం వలన లక్షలాది కుటుంబాలకు ప్రయోజనం కలిగిందన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రన్న బీమా పథకానికి ఇచ్చే పథకాన్ని 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచుతామని ఎన్నికల మానిఫెస్టోలో చంద్రబాబు చెప్పారన్నారు. ఇచ్చిన హామీ మేరకు సంబంధిత అధికారులతో ఆయన చర్చించి ఈ బీమా పథకాన్ని 10 లక్షలకు పెంచాలని నిర్ణయిం చారని, ఇందుకు ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. గతంలో మాదిరిగానే కుటుంబ సభ్యులందరికీ ఈబీమా వర్తింపజేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేస్తున్నామన్నారు.టీడీపీ నాయకులు పి.రాము,విజయ్, సత్య నారాయణరెడ్డి, మురళీకృష్ణారెడ్డి, నరసింహ,వెంకటేశ్వర్లు, అశోక్,మహమ్మద్, భగవాన్, నజీర్, ఉన్నారు.

## 18 ముదివర్తి ప్రాథమిక వ్యవసాయ సొసైటీ మహాజన సభ



**విడవలూరు సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గ పరిధిలోని విడవలూరు మండలం ముదివర్తి గ్రామంలో ఉన్న ముదివర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభ బుధవారం సాయంత్రం 4 గంటలకు సొసైటీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి ఈ. కోటేశ్వరి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె మాట్లాడుతూ ఈ మహాజన సభకు సొసైటీ పరిధిలో ఉన్న సభ్యుల రైతులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. సొసైటీ సీఈవో ఎస్. సురేష్‌కుమార్ రెడ్డి ఉన్నారు.

## ఘనంగా విష్ణు సహస్రనామ పారాయణం



**కోవూరు, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** కోవూరులోని కోదండరామ స్వామి దేవస్థానంలో సోమవారం భక్త బృందంవిష్ణు సహస్రనామ పారాయణాన్ని సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.స్వామివారికి ఆలయ ప్ర ధాన అర్చకులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యం లో అభిషేక పూజలను ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఆట్యా-పాట్యా చాంఫియన్ షిప్‌లో నెల్లూరు క్రీడాకారుల ప్రతిభ




**నెల్లూరు, సెప్టెంబరు16 ప్రభాతవార్త-విద్య** ఇటీవల కర్నూలు నగరం డిఎస్ఏ స్టేడియంలో జరిగిన 9వ రాష్ట్రస్థాయి జూనియర్ ఆట్యా-పాట్యా రాష్ట్రస్థాయి చాంఫియన్ షిప్-2024లో నెల్లూరు జిల్లా క్రీడాక్రారులు ఉత్తమ ప్రతిభ కనపరిచి సత్తా చాటారు. జిల్లా బాలుర జట్టు ద్వితీయ స్థానాన్ని సాధించంగా బాలికల జటుట తృతీయస్థానాన్ని కైవశం చేసుకుంది. ఈ సందర్భగా నిర్వాహకులు విజేతలుగా నిలిచిన జట్లకు ట్రోఫీలను అందజేసి ఘనంగా సత్కరించారు. అలాగే ఈ పోటీల్లో అత్యంత ప్రతిభ కనపరిచిన జి.సురేంద్ర, టి.సంతోష్, బి.సబిత, ఏ ప్రత్యూషలు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైయారు. నవంబరు 5నుండి 7వ తేదీ వరకు ఈ పోటీలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా జిల్లా ఆట్యా-పాట్యా కార్యదర్శి కృష్ణవేణి, అధ్యక్షులు ప్రసాద్, నిర్వహణ కార్యదరి ్శ అజయ్‌కుమార్‌లను పలువురు ప్రశంశించారు.




## నత్తనడకన ఆలయ రిటైనింగు వాల్ పనులు



**వలేటివారిపాలెం సెప్టెంబరు 16, ప్రభా తవార్త** మాలకొండ శ్రీమాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ సన్నిధిలో కొండపైన ఏడాది క్రితం రిటైనింగు వా ల్ నిర్మాణానికి రూ. 2.40కోట్లు నిధు లు మంజూరుచేశారు. ఈ పనులును ఉత్తరాంధ్రకు చెందిన ఓ కా ంట్రాక్టర్ టెండరు ద్వారా చేజిక్కించుకు న్నారు.అయితే రమేష్ అనే వ్యక్తిపనులు చేయిస్తున్నారు. ఏడాది క్రితం ప్రారం బించిన పనులు నత్తనడకన సాగుతున్నాయి.నిర్మాణంలో ఉపయోగిస్తున ్న సిమెంటు,ఇసుక,ఇనుక తదిర మె టీరియల్ వాడకంలో నాణ్యతా ప్రమాణాలు సైతం పాటించడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.అన్నదాన కళ్యాణమండపంకు తూర్పున రక్షణగోడ అవసరమవడంతో ఈ పనులుకు అధికారులు శ్రీకారం చుట్టా రు.ప్రతిశనివారం సుమారు 5నుంచి 7వేల మందిదాకా అన్నప్రసాదాలుకు హాజరవుతారు.ఈ నేపద్యంలో అన్నదాన మండపం విస్తరణకు రిటైనింగు వాల్ అవసరమైంది.ఇందుకోసం ఏడాది కిందటపనులు ప్రారం భమైనా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం అశ్రద్ద కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి.దీంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు.ఈ విషయమై ఇటీవల కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగశ్వరావు ఈ గోడ నిర్మాణ తీరును పరిశీలించారు.త్వరితగతిన పనులు పూర్తిచేయాలని డిప్యూటీ కమీషనర్ కె.బి.శ్రీనివాసరావుకు సూచించారు.

## మున్సిపల్ భవన నిర్మాణంలో గోప్రధక్షిణ



**బుచ్చిరెడ్డిపాలెం, సెప్టంబరు16 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాలెం నగరంలో పాత మున్సి పల్ భవన నిర్మాణ పనులు ఎటువంటి ఆటంకం లేకుండా జరగాలని కమీషనర్ చంద్రశేఖర్ రెడ్డి గోప్రదక్షిణ చేయించారు. ప్రత్యేకంగా గోవును తీసుకోని వచ్చి పూ జలు నిర్వహించారు. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గోవు సకల దేవతా స్వరూ పమని ఈ స్థలంలో గోవు తిరిగితేనిర్మాణ పనులు ఎటువంటి ఆటంకాలు లేకుండా జరుగుతాయని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలియజేశారు. తెలుగుదేశం నాయకులు తాళ్ళనరసింహ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఢంపింగ్ యార్డును పరిశీలించిన కమీషనర్



**బుచ్చిరెడ్డిపాళెం, సెప్టంబరు16ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం చివారులో విలియమ్స్‌పేట వద్ద ఢంపింగ్ యార్డును మున్సిపల్ కమీషనర్ చంద్రశేఖర రెడ్డిసోమ వారం పరిశీలించారు. అందులో నుండి వెలువడుతున్న పోగను పరిశీలించారు. చెత్తను గుట్టలుగా వేయడం వల్ల వేడి పెరిగి పోగ వస్తుందని తక్షణమే ఢంపింగ్ యార్డులో నీటితో ఆ చెత్తను తడపడం వల్ల పోగ చాలా వరకుని యంత్రించవచ్చని ఆయన సిబ్బందికి సూచించారు. ఢంపింగ్ యార్డులో పచ్చదనం పెంపోందించేలా మొక్కలునాటినందువల్ల దుర్గందాన్ని చాలా వరకు ని యంత్రించవచ్చన్నారు. చుట్టుపక్కల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండాఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## పైపు లీకేజిని పరిశీలించిన బుచ్చి మున్సిపల్ కమీషనర్



**బుచ్చిరెడ్డిపాళెం, సెప్టంబరు16ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం పెద్ద ఊరుకి తాగునీటిని సరపరా చేసే పైపులైను లీకేజి ఏర్పడింది. సోమవారం కమీషనర్‌చంద్రశేఖర్ రెడ్డి దానిని పరిశీలించారు. 1970 సంవత్సరంలో సిమెంట్ పైపు ద్వారా నిటి సరఫరా ఏర్పాటు చయడం జరిగిందని,వీటికి మరమత్తులు చేపట్టాలని అలాగే ఈ పైపులైను మలిదేవి బ్రిడ్జీకి అనుసంధానం చేయడం ద్వారాబ్రీడ్జీ పూర్తిగా దెబ్బతిని పోయిందని చెప్పారు. పైపు లైను పూర్తి స్థాయిలో మార్చాలంటే బ్రీడ్జీ నిర్మాణం జరిగితేనేసాధ్యమవుతుందని సిబ్బంది కమీషనర్‌కు వివరించారు. అనంతరం కమీషనర్ మాట్లాడుతూ పైపులైను మరమత్తులుఅయ్యేంతవరకు నగరవాసులకు ఇబ్బంది తలెత్తకుండా ట్యాంకర్‌ల ద్వారా నీటిని సరఫరా చేయనున్నట్లు ఆయన తెలిపారు.

## 19 నుండి మండల స్థాయిలో స్పోర్ట్స్‌కు క్రీడాకారులు ఎంపిక

**బిట్రగుంట, సెప్టెంబరు 16 ప్రభాతవార్త** బోగోలు మండలంలోని విశ్వనాథరావుపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఈ నెల 19 నుండి మండల స్థాయిలో జరిగే క్రీడలకు సంబంధించి ఎంపికలు నిర్వహిస్తారని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల కోఆర్డినేటర్ రవీంద్రనాధ్‌ఠాగూర్ తెలిపారు. 19న అథ్లెటిక్స్, యోగా, చెస్, బ్యాడింటన్‌కు, 20వ తేదిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలకు ఎంపికలు జరుగుతాయన్నారు. మండలంలోని అన్ని పాఠశాలలకు సంబంధించిన 14 సంవత్సరాల లోపు, 17 సంవత్సరాల లోపు బాలబాలికలు ఈ క్రీడల్లో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ క్రీడలు మండల విద్యాశాఖాధికారులు నరసింగరావు, జయమ్మల పర్యవేక్షణలో జరుగుతాయని ఆయన తెలిపారు.

## ఘనంగా మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు



**అనుమసముద్రంపేట, సెప్టెంబర్16ప్రభాతవార్త:** మండలకేంద్రమైన ఏఎస్‌పేటలో సోమవారం మహ్మద్ ప్రవక్త పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక ముస్లిం పెద్దలు , యువకులు, పిల్లలు స్థానికంగా ఉన్న ప్రముఖపుణ్యక్షేత్రమైన హజరత్ ఖాజా రహమతుల్లా నాయబ్‌రసూల్ దర్గా నుండి జెండాలను చేత పట్టుకొని నారే తక్బీర్, అల్లాహ్ హు అక్బర్ అనే నినాదాలతో తమ భక్తిని చాటుకుంటూ భక్తికీర్తనలు చేస్తూ ఊరేగింపుగా బయలుదేరి కొండపై ఉన్న బురుజు వద్దకు చేరుకొని అక్కడ జెండాను ప్రతిష్టించి ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. అనంతరం మహ్మద్ ప్రవక్త గొప్పతనాన్ని మత పెద్దలు వివరించారు. అక్కడకు వచ్చిన వారికి అల్పాహార విందును ఏర్పాటు చేశారు. అలాగే అనుమసముద్రం లో కూడా స్థానికంగా ఉన్న పెద్ద మసీదు దగ్గర నుండి ముస్లిం యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి జెండాను ఊరేగింపుగా నగారాఖానా సెంటర్ మీదుగా కొండపై ఉన్న బురుజు వద్దకు చేర్చి జెండాను ప్రతిష్టించారు. ఈసందర్భంగా స్థానిక ఎస్ఐ ఎ.సైదులు పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈకార్యక్రమంలో స్థానిక ముస్లిం సోదరులు సయ్యద్ రహమత్ నవాజ్, సయ్యద్ రషీద్, పఠాన్‌అక్రమ్, సయ్యద్ ఆబిద్, సయ్యద్ ఖాజా ఖాదిరుల్లా, మహ్మద్ షకీల్ అహ్మద్, షేక్ నజీర్ అహ్మద్, షేక్ బాబు, సయ్యద్ సలీంబాబా, సయ్యద్ జమీల్ అహ్మద్, పఠాన్ అప్రోజ్, పఠాన్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

**ఉలవపాడు, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త** అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సోమవారం పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై అంకమ్మ కథనం ప్రకారం ఉలవపాడు మండలం మన్నేటికోట మన్నేరు నుండి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు చేసి ఆరు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని స్టషన్‌కు తరలించారు. దీంతో ఇసుక తరలింపునకు ఎటువంటి అనుమతి పత్రాలు లేనటువంటి రెండు ట్రాక్టర్లు మీద క్రిమినల్ కేసులు నమోదు చేసి ఇసుక లేనటువంటి నాలుగు ట్రాక్టర్ల యజమానులకు కౌన్సిలింగ్‌కి ఇచ్చి పంపడం జరిగిందని ఎస్సై అంకమ్మ తెలిపారు.

## కూటమి ప్రభుత్వంలో తాగునీటికి సాగునీటికి అధిక ప్రాధాన్యత ; ఎమ్మెల్యే కాకర్ల



**కలిగిరి, శప్టెంబర్16, ప్రభాతవార్త;** కూటమి ప్రభుత్వం రైతు, ప్రజా ప్రభుత్వమని కూటమి ప్రభుత్వంలో సాగునీటికీ, తాగునీటికీ అధికప్రాధాన్యత నివ్వడం జరుగుతుందని ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్ తెలిపారు.సోమవారం మండల కేంద్రమైన కలిగిరి పెద్దచెరువుఆధునీకరణ(గ్రామ కొలను)పనులకు కాకర్ల చేతులమీదుగా శంకుస్తాపన చేసి పనులను ప్రారంభించారు.అనంతరం చెరువు స్తితి గతులగురించి, చెరువుకు చేయవలసిన పనులగురించి ఇరిగేషన్ డిఇహరీష్ ని అడిగి తెలుసుకున్నారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువారం రైతులకు అధిక ప్రాదాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. అందులో బాగంగానే ఉదయగిరి నియోజకవర్గంలోని మొట్ట మొదటిసారిగా కలిగిరిలో రైతులకు ఉపయోగపడే విదంగా గ్రామ కొలను పనులను ప్రరంభించడం జరిగిందన్నారు.మహాత్మాగాంధీ జాతీయ ఉపాది హామీ గ్రాంటుకిందఈపనులు మొత్తం రు.2.15కోట్లతో పనులు ప్రారంబించడం జరిగిందన్నారు. 6నెలల్లో ఈపనులను పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఇందులో చెరువుకట్ట ఆదునీకరణ, చెట్లు తొలగించడం, కలుజు లెవల్ పెంచడం తదితర పనులు ఉంటాయన్నారు. అదేవిధంగా రైతులకు ఉపయోగపడే సోమశిల ఉత్తరకాల్వ లిఫ్ట్ ఇరేగేషన్ పనులుకూడా సాధ్యమైనంత తొందరలో సాదించి ఈ ప్రాంతానికి తాగు సాగునీటి సమస్యను పరిష్కరుఇంచేందుకు కృషిచేస్తానన్నారు.కలిగిరి పంచాయితీలో పారిశుధ్యపనులను తాను స్వయంగా పరిశీలిస్తానని,కలిగిరిప్రజలు తాగునీటికోసం ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని దాని సమస్యకు కూడా పరిష్కరించేవిధంగా కృషిచేస్తానన్నారు. ఇకపైఉదయగిరి ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి వచ్చిన సమస్యలను ఒక్కొకటిగా పరిష్కరిస్తూ ముందుకు పోతానని, యనియోజకవర్గంలోని కలిగిరి కొండాపురం రోడ్డు ఆదునీకరణ, మరికొన్ని గ్రామాలలో రోడ్లు పనులు పూర్తి చేయవలసి ఉందన్నారు.నియోజకవర్గంలోని సమస్యలుఒక్కొక్కటిగా తెలుసుకొని పర్కిరిస్తానని కాకర్ల సురేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలోసిఐ వెంకట నారాయణ టిడిపి కలిగిరి మండల పార్టీ అధ్యక్షులు బిజ్జం క్రిష్ణారెడ్డి, సీనియర్ నాయకులు బొల్లినేని వెంకట రామారావు, మల్నేనిశ్రీనివాసులు నాయుడు, రైతు నరేంద్ర,పూసాల వెంగపనాయుడు,జనసేన మండల పార్టీ అధ్యక్షులు మందారు లక్ష్మీన్నారాయణ, బందారు మల్లికార్జున, చీమల తాతయ్య,బుజ్జయ్య,గన్నమనేపని శ్రీనివాసులు సిహెచ్ సుబ్బారెడ్డి,కొండారెడ్డి, మొక్కా హజరత్‌బాబు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నందనవనం ప్రభాకర్‌రావు ఎపిఒ శ్రీనివాసులుతదితరులు పాల్గొన్నారు.

## దళిత యువకులను కొట్టిన పోలీసుల పై ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేయాలి



**నెల్లూరుకార్పొరేషన్ ,సెప్టెంబర్ 16,ప్రభాతవార్త:** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జి ల్లా,సర్వేపల్లి నియోజక వర్గం ముత్తుకూరు మండలంలో దళిత కులానికి సంబం ధించిన తమ కుటుంబ సభ్యులను అమానుషంగా కొట్టిన పోలీసులపై,ఎస్సీ.ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని పలువురు బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.నెల్లూరు నగరంలోని ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తాము ముత్తుకూరు దళిత ఎస్సి కులానికి చెందిన వారమని తెలిపారు. విద్యార్థుల మధ్య ఏర్పడిన వివాదంలో తమ కుటుంబ సభ్యులైన అమావాస్య హరీష్,సందీప్ తో పాటు నలుగురి పై ఎస్సై,కానిస్టేబుల్ లు విచక్షణా రహితంగా కొట్టారన్నారని చెప్పారు.పోలీస్ స్టేషన్లో నిర్బంధం చేసి ఎఫ్ఐఆర్ లు నమోదు చేశారన్నారన్నారు.దళితులకు అన్యాయం జరిగితే ప్రశ్నించాల్సింది పోయి,తప్పు చేసిన వారికి వత్తాసు పలికేలా కొందరు మా సామాజిక వర్గానికి చెందిన నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శిం చారు.దళితుల పై జరిగిన దాడిని తెలుసుకొని పరామర్శించేందుకు వెళ్లిన దళిత నాయకులైన కొప్పోలు రఘు,వదనాల వెంకటరమణను తప్పుపట్టే అర్హత అతనికి లేదన్నారు.ఈ విషయం పై జిల్లా కలెక్టర్ ను కలిసి సిఐ,ఎస్సై లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఇంట్లో ఉన్న తమ కుటుంబ సభ్యులకు వెంట నే మెరుగైన వైద్య చికిత్స అందించాలని ఈ ఘటనపై ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో బాధితుల కుటుంబ సభ్యులు అను,పద్మ,శారద తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం కండువా కప్పుకున్న పాలకీర్తి రవి



**నెల్లూరు రూరల్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వైఎస్ఆర్‌సిపి నాయకులు, తెలుగుదేశం పార్టీలో చేరేందుకు క్యూ పడుతున్నారు. కార్పొరేటర్ల దగ్గర నుండి జిల్లాలో అనేక పదవులు ఉన్న వైసిపి నేతలు రూరల్‌లో వలసబాట పడుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి కార్యాలయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి, ఆరవ కామాక్షి, వేలూరు శంకర్ రెడ్డి, గౌరీ శంకర్, మురళీకృష్ణ, షేక్ షబ్బీర్, షేక్ అజారుద్దీన్, ఎస్. రాజారెడ్డి, వారి అనుచరులతో కలిసి తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. ముందుగా భారీ ర్యాలీగా బయలుదేరి రూరల్ కోటంరెడ్డి కార్యాలయంలో వైసిపి నాయకులు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డికి గజమాలతో సత్కరించారు. అనంతరం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జిలు మన్నెం పెంచలనాయుడు, జనాదంకి సుధాకర్, సైలేంద్రబాబు, తోట సునీల్, కనపర్తి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు



**ఉలవపాడు సెప్టెంబర్ 16, ప్రభాతవార్త** మండలంలో రోడ్డు పక్కన, ప్రధాన రహదారుల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టు కంచె ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా ఉంచారని ప్రజలు అంటున్నారు. ప్రతి గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు 7-8 ఉన్నాయి. వాటిలో ఏ ఒక్కదానికి కూడా కంచె లేదు. వర్షాలు పడినప్పుడు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్ నియమనిబంధనలకు ట్రాన్స్‌ఫార్మర్లు అనుగుణంగా ఏర్పాటు చేయలేదని విమర్శలు ఉన్నాయి. ఉలవపాడులో పీవీ రావుబొమ్మ దగ్గర, ప్రసాద్ హాస్పిటల్ సెంటర్, కొత్త వడ్డిపాలెం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంటర్, నాలుగు సెంటర్లో ప్రతి రోజు ప్రయాణికులు, ప్రజలు, విద్యార్థులు రాకపోకలు సాగించే ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల మనిషి కూర్చున్న కూడా వైర్లు తగిలేటట్లుగా ఉన్నాయి. బస్ కోసం ప్రయాణికులు ఎంతో మంది ఉంటారు. దాని చుట్టు బడ్డీ దుకాణాలు ఉండటంతో ఎప్పుడు ఎవరు విద్యుత్ ఘాతానికి గురి కావాల్సి వస్తుందో అని భయపడుతున్నారు. చుట్టు ఉన్న దుకాణాలను తొలగించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టు కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అధికారులు అంతులేని నిర్లక్ష్యం ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టు కంచె నిర్మాణం తప్పనిసరైన అధికారులు మాత్రం ఈ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయడం లేదు. అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శించడం ఏమాత్రం సరికాదని అధికారులు విద్యుత్ బిల్లుల వసూళ్లపై ఉన్న శబ్ధ ట్రాన్స్‌ఫార్మర్‌పై చూపడం లేదని మండిపడుతున్నారు. ఇక నుంచైనా ప్రమాదం జరగకుండానే ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టు కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.